దమ్మాయిగూడను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో పెద్ద ఎత్తున మున్సిపల్ నిధులను వెచ్చించి అభివృద్ధి పనులను చేపడుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్ అన్నారు. గురువారం 4వ వార్డు బాలాజీ ఎంక్లేవ్‌లో రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, 5వ వార్డు చిత్తారమ్మ గుడి వద్ద రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ మురుగు కాలువ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ... అందరి సహకారంతో పురపాలక సంఘాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ నాగమణి, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగళపూరి వెంకటేష్, కొత్త సురేఖగౌడ్, నానునాయక్, కొత్త హేమలత, కో ఆప్షన్ సభ్యులు షేక్, శాదుల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ చైర్ పర్సన్ వనుపతి ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్ అన్నారు. స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడ లీడ్ ఇండియా భారత రత్న స్కూల్, 18వ వార్డులోని ప్రభుత్వ పాఠశాల్లో గ్రామ, పట్టణ ప్రాంతాల పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం, పరిసరాల పరిశుభ్రంగా ఉంచేందుకు విద్యార్థులతో ప్రతిజ్ఞతోపాటు, మానవహారాన్ని నిర్వహించారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారం తొలగించడంతో పాటు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే పనుల్లో పాల్గొన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరిస్తూ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నాగమణి, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగళపూరి వెంకటేష్, రామారం శ్రీహరిగౌడ్, మేనేజర్ వెంకటేషం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య బీమా.. వృద్ధులకు ధీమా..!



- ప్రజారోగ్యానికి కేంద్రం పెద్ద పీట
- పేద, ధనిక అనే తారతమ్యం లేదు
- 70 ఏళ్లు నిండిన అందరికీ ఉచిత వార్షిక బీమా
- రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం

గ్రేటర్‌సహా శివారు జిల్లాల్లో 5 లక్షల మందికిపైనే వృద్ధులు ఉంటారని అంచనా

సాక్షి, సిటీబ్యూరో: ప్రజా వైద్యానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ. 5 లక్షల ఉచిత వార్షిక వైద్య బీమా సౌకర్యాన్ని కల్పించే నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. దీనివల్ల అన్ని సామాజికవర్గాల వృద్ధులకు వైద్య బీమా లభించనుంది.

- దరఖాస్తు చేసుకున్న వారికి నూతన కార్డులు జారీ చేయనుంది. దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి-జన్ ఆరోగ్య యోజన (ఏబీపీఎం-జేఏవై)ను 2018 నుంచి అమలు చేస్తోంది.
- తాజాగా ఈ పథకాన్ని 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు విస్తరిస్తోంది. ఆదాయంతో సంబంధం లేకుండా వృద్ధులందరూ ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా పొందవచ్చు.

5 లక్షల మంది వృద్ధులకు ప్రయోజనం...

ప్రస్తుతం వైద్యంపై చేసే వ్యయం భారీగా పెరుగుతున్న తరుణంలో కేంద్రం తీసుకొచ్చిన రూ. 5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా పథకంతో గ్రేటర్ హైదరాబాద్‌సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో సుమారు 5 లక్షల మంది వృద్ధులకు ప్రయోజనం చేకూరనుంది.

- వయసు పెరిగేకొద్దీ వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు వెంటాడుతాయి. ఈ పథకంతో ఆయా కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది.
- ఈ పథకం ద్వారా ఒక కుటుంబంలో 70 ఏళ్లు పైబడినవారు ఒక్కరు ఉంటే రూ. 5 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. అదే ఇద్దరు ఉంటే రూ. 2.50 లక్షల చొప్పున ఇలా.. కుటుంబంలో 70 ఏళ్లు పైబడినవారు ఎంతమంది ఉన్నా.. వారందరికీ రూ. 5 లక్షలు సమానంగా వర్తిస్తాయి. ఇప్పటికే వేర్వేరు బీమా పథకాల్లో నమోదైన వృద్ధులు సైతం ఆయుష్మాన్ భారత్‌తో లబ్ధి పొందవచ్చు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంటోంది.

వృద్ధులకు అవగాహన కల్పించే దిశగా...

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం విధివిధానాలపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరముంది. 2018 నుంచి ఈ పథకం అమలవుతున్నా.. అర్హులెవరనే దానిపై ప్రజల్లో స్పష్టత లేదు. అర్హులకు ఏఏ ఆస్పత్రుల్లో వైద్యం అందుబాటులో ఉంటుంది.. బీమా ఎలా వర్తింపజేసుకోవాలనే అంశాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఎలాంటి ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వారందరికీ ఈ పథకం వర్తింపజేయనుండటంతో దరఖాస్తు విధానం, బీమా పొందటంపై వృద్ధులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

అర్హతలు ఇవే...

- ఈ పథకం కింద ఇప్పటి వరకు ఆర్థికంగా వెనుకబడిన కొన్ని వర్గాల ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉంది. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆదాయంతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ కుటుంబం ఆధారంగా రూ. 5 లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తోంది. ప్రైవేటు ఆరోగ్య బీమా ఉన్నవారికి కూడా ఈ పథకం వర్తించనుంది.
- ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్), ఎక్స్ సర్వీసు మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఈసీహెచ్ఎస్) వంటి ఇతర పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్నవారు వాటినే కొనసాగించవచ్చు లేదా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఎంచుకోవటానికి అవకాశముంది. రాష్ట్ర ప్రభుత్వ బీమా పథకాలు పొందేవారికి వాటితో సంబంధం లేకుండా ఈ పథకం వర్తిస్తుంది.

నేడు పెట్స్‌కు ఏఆర్‌వీ టీకాలు

కీసర: ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్, వరల్డ్ వెటర్నరీ సర్వీసెస్ సహకారంతో సామూహిక యాంటీ రేబిస్ టీకా (ఏఆర్‌వీ) డ్రైవ్‌ను దమ్మాయిగూడలో శుక్రవారం నిర్వహించనున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం పెట్స్‌కు ఏఆర్‌వీ టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వీధి కుక్కలతోపాటు, పెంపుడు కుక్కలకు సైతం రేబిస్ టీకాను అనుభవజ్ఞులైన పశువైద్యులతో వేయించనున్నట్లు వివరించారు. వీధికుక్కలు పెంపుడు కుక్కలను ప్రమాదవశాత్తు కరిచినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు.

రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్, వైస్ చైర్మన్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 3, 12వ వార్డులలో రూ. 10 లక్షలు, రూ. 15 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి ఆయా రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కౌన్సిలర్లు సంగీత, ఆంజనేయులుగౌడ్, మల్లేశ్, నాయకులు చిత్తారి యాదవ్, జంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రహీం, మాధవరెడ్డి, మల్లేశ్‌యాదవ్, నాగరాజు ముదిరాజ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సింగిరెడ్డి మాధవరెడ్డికి నివాళి



మేడ్చల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు గౌడవెల్లికి చెందిన సింగిరెడ్డి మాధవరెడ్డి వర్ధంతిని గౌడవెల్లిలో గురువారం నిర్వహించారు. ఆయన కుమారుడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రంగారెడ్డి జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జిల్లాలోని నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్‌లు, నాయకులు తోటకూర వజ్రేష్ యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి, బండి రమేష్, సత్యం శ్రీరంగం, వివిధ నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో ముస్లింల భారీ ర్యాలీ



మేడ్చల్: మిలాద్ ఉన్ నబీ వేడుకలలో భాగంగా మేడ్చల్ పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పెద్ద మసీదు నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా సాగింది. మత పరమైన జెండాలను చేతబట్టిన ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.

స్థానికేతరుల ఓట్లను తొలగించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వసంతలక్ష్మి

మేడ్చల్: గ్రామాల్లో నివాసం ఉండకుండా ఓటు హక్కు పొందిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించాలని మండల అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో నివాసం ఉండకుండా కేవలం ఎన్నికల కోసం కొంతమంది వలస కార్మికులు, మరికొంతమంది నాయకుల బంధువుల పేర్లను ఓటరు జాబితాలో చేర్పిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిని అధికారులు అలాంటి వారిని వారి ఓటు హక్కును తొలగించాలని సూచించారు. గ్రామంలో ఏ వార్డులో నివాసముంటున్నా ఒకే ఇంటి పేరు ఉన్న వారిని ఒకే వార్డు ఓటరు లిస్ట్ ఉంచుతున్నారని ఎక్కడ నివాసముంటే ఆ వార్డులో ఓటరుగా చేర్చాలని అన్నారు. అధికారులు మండలంలోని 14 గ్రామాల ఓటర్ లిస్టను వార్డుల వారీగా పురుషులు, మహిళల జాబితాలను నాయకులకు పంపిణీ చేశారు. జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా గ్రామ పంచాయతీలలో తెలియజేయాలన్నారు. ఎంపీడీఓ వసంతలక్ష్మి, ఎంపీఓ సునీత, సూపరింటెండెంట్ ఉదయ్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు రమణారెడ్డి, సుదర్శన్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తపాలా బీమాపై అవగాహన

కీసర: పేదలకు ఉపయోగ పడే ఆరోగ్య బీమా, ప్రమాద బీమా పథకాన్ని (పోస్టల్‌లైఫ్ ఇన్సూరెన్స్) సద్వినియోగం చేసుకోవాలని కీసరకు చెందిన బీజేపీ నేత నల్ల వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఒకే పాలసీతో రెండు లాభాలు పొందవచ్చన్నారు. సంవత్సరానికి రూ. 755 చెల్లిస్తే 15 లక్షల వరకు బీమా, రూ. 555 చెల్లిస్తే రూ. 10 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఈ మేరకు కీసర గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు.



అవగాహన కల్పిస్తున్న బీజేపీ నేతలు

అవుషాపూర్‌లో చైర్‌పర్సన్ పర్యటన



అవుషాపూర్‌లో పైప్‌లైన్ మరమ్మతు పనులు పర్యవేక్షిస్తునన చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో గ్రామంలో బీటీ, సీసీ రోడ్డు పనులు, మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్, రెండు బోర్లకు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో నేతలు మాధవరెడ్డి, వెంకటరెడ్డి, మల్లేశ్ యాదవ్, నాగరాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తేనే ఉన్నత అవకాశాలు



ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఉన్నత అవకాశాలు సొంతం అవుతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో 68వ కీసర జోనల్‌స్థాయి క్రీడాపోటీలను గురువారం స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే విస్తృత అవకాశాలు లభిస్తాయన్నారు. ఆ దిశగా విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాట్లాడుతూ.. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు శారీరక దారుఢ్యం సొంతమవుతుందన్నారు. గెలుపోటములు సహజమని, స్నేహపూరిత వాతవరణంలో పోటీపడాలన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించనున్నారు. రెండ్రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో పోటీలు జరగనున్నాయి. జోనల్ పరిధిలోని సుమారు 1500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, మండల విద్యాధికారి శశిధర్, పాఠశాల హెచ్ఎం బాపురెడ్డి, కిష్టయ్య, రమేష్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్, పాండురంగారెడ్డి, తిరుమల్‌రెడ్డి, మనోహర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు అందరూ సహకరించాలి



స్వచ్ఛ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ జంగయ్యయాదవ్

బోడుప్పల్: స్వచ్ఛ భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా గురువారం చెంగిచర్ల 1వ డివిజన్ పోచమ్మ చెరువు వద్ద కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ జవాన్ వినోద్ కాలనీవాసులు చెత్తను తొలగింపజేశారు. అనంతరం గణేష్ వినాయక మండపాల వద్ద వ్యర్థాలను తొలగించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులచే మానవహారం నిర్వహించి శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆఫీసర్ నరేష్, స్వచ్ఛ భారత్ మిషన్ కో- ఆర్డినేటర్లు మల్లేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలి

మల్లాపూర్: నాచారం ఎర్రకుంట, పటేల్ చెరువు, హెచ్ఎంటీనగర్ చెరువులోని బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో వెలసిన నిర్మాణాలు, ఆక్రమణలను తొలగించాలని కోరుతూ.. గురువారం హైడ్రా కమిషనర్‌కు నాచారం చెరువుల పరిరక్షణ సమితి కన్వీనర్ కొమ్మగళ్ల వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. గతంలో చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వ విభాగాల అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేదన్నారు. ప్రస్తుతం చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చెరువుల పునరుద్ధరణకు హైడ్రా పెద్దపీట వేస్తున్నదని హర్షం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ కాలనీలో కబ్జాలను అరికట్టండి

మేడ్చల్: అత్వెల్లిలోని ఇందిరమ్మ కాలనీలో కొంతమంది నాయకుల అండతో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేందాస్ ఆరోపించారు. ఇళ్లు లేక ఎంతోమంది ఇబ్బందులు పడుతుంటే అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అన్యాక్రాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో బీజేపీ పోరాటం చేస్తుందని అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పోచారం: నారపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అల్వాల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి గురువారం పరిశీలించారు. అంగన్‌వాడీలోని పిల్లలలో ఎత్తుకు తగిన బరువు లేనివారిని నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపి వైద్యులచే పరీక్ష చేయించారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు శాతంతో పాటు ఇతర రికార్డులను తనిఖీ చేశారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురిపై కేసు

ఘట్‌కేసర్: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురిపై ఘట్‌కేసర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... మంచిర్యాల్‌కు చెందిన శివకుమార్(27), రఘువర్మ(26) ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్‌లో ఉంటున్నారు. ఘట్‌కేసర్ పోలీసులు పట్టణంలోని అండర్ పాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనపించిన బైక్‌ను ఆపి సోదా చేయగా బైక్ కవర్‌లో 90 గ్రాముల ఎండు గంజాయి లభించింది. అదుపులోకి తీసుకొని విచారించగా పోచారం మున్సిపాలిటీ రాజీవ్ గృహకల్పలో ఉండే అహ్మద్ వద్ద కొనుగోలు చేసి ఘట్‌కేసర్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. శివకుమార్, రఘువర్మతో పాటు గంజాయి విక్రయించిన అహ్మద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సైదులు వివరించారు.

దీపు మృతదేహం వెలికితీత

మేడ్చల్‌రూరల్: మద్యం మత్తులో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి ఇద్దరు నీటిలో మునిగి మరణించిన ఘటనలో పోలీసులు బుధవారం సాయంత్రం ఒకరి మృతదేహాన్ని వెలికితీయగా గురువారం ఉదయం మరో మృతదేహాన్ని వెలికితీశారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్కల్‌గూడ గ్రామ పరిధిలోని కోమటికుంట చెరువులో ఈతకు వెళ్లి నెల్సన్, దీపు(29) గల్లంతైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టి నెల్సన్ మృతదేహన్ని వెలికితీయడం, అప్పటికే చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. కాగా గురువారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు గల్లంతైన దీపు మృతదేహన్ని వెలికితీసి గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

సందడిగా బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మేడ్చల్ పట్టణంలో బీజేపీ పట్టణ నాయకులు సందడిగా నిర్వహించారు. పట్టణ పరిధిలోని బీజేపీ అభిమానులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి మొబైల్ యాప్ ద్వారా సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి నాయకులతో కలిసి సభ్యత్వ నమోదు తీరును పరిశీలించారు. పార్టీ సభ్యత్వ నమదు కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలు, అభిమానుల మంచి మంచి ఆదరణ లభిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్‌కు చెందిన పలువురు న్యాయవాదులకు పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీ పట్టణ నాయకులు ఆంజనేయులు, జాకట ప్రేందాస్, అర్జున్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నోజిగూడలో రూ. 2.55 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



అన్నోజిగూడలో లడ్డూ దక్కించుకొన్న జితేందర్ నాయక్



పోచారంలో లడ్డూ సొంతం చేసుకున్న బద్ధం శ్రీనివాస్‌రెడ్డి

పోచారం: అన్నోజిగూడలో బంజారా యూత్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద గురువారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. వేలంలో పాల్గొన్న నానావత్ జితేందర్ నాయక్ అత్యధికంగా రూ. 2.55 లక్షలకు పాడుకొని లడ్డూను దక్కించుకొన్నారు. పూలు, పండ్లను అతిమల అశోక్‌రెడ్డి రూ. 27 వేలకు పాడుకొని సొంతం చేసుకున్నారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, తండా నాయకులు రాంసింగ్, సంతోష్, కమిటీ వ్యవస్థాపకులు గుగులోత్ గోవింద్ నాయక్, విజయ్ సింగ్, విస్లావత్ రామ్ నాయక్, అసోసియేషన్ అధ్యక్షుడు నానావత్ రాకేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి అంగోత్ ఆతిత్య తదితరులు పాల్గొన్నారు.

పోచారం గ్రామంలో...

హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన వేలం పాటలో అత్యధికంగా రూ. 2 లక్షలకు పోచారానికి చెందిన బద్ధం శ్రీనివాస్ రెడ్డి పాడుకొని లడ్డూను సొంతం చేసుకున్నారు.

పండుగ ముగిశాక టెండర్లకు ఆహ్వానం

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ ఇంజినీరింగ్ అధికారుల తీరు పలు అనుమానాలకు దారితీస్తోంది. ఏటా వినాయక నిమజ్జనం సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని డివిజన్‌లలో రహదారుల మరమ్మతులు చేపడుతుంటారు. దీనికి సంబంధించి అన్ని విభాగాల అధికారులు, భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులపై అభిప్రాయాలు తెలుసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు. ఈసారి గౌతంనగర్ డివిజన్ పరిధిలో మరమ్మతుల కోసం రూ. 18 లక్షలు, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలో రూ. 13.80 లక్షలు, వినాయకనగర్ డివిజన్ పరిధిలో రూ. 25 లక్షలు జనరల్, మరో రూ. 20 లక్షలు, ఎస్సీ సామాజికవర్గానికి కేటాయిస్తూ.. మొత్తం రూ.76.80 లక్షలకు 12న టెండర్లు పిలిచి నిమజ్జనం తర్వాత రెండ్రోజులకు గురువారం టెండర్లు ఓపెన్ చేశారు. ఈనెల 17న నిమజ్జన ఘట్టం ముగిసింది. సర్కిల్ పరిధిలో వర్షాకాలం కోసం ఏర్పాటు చేసిన మాన్‌సూన్ టీమ్‌తోనే రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేశారు. వాస్తవానికి టెండర్లు రద్దుచేసి కాలనీల్లో అభివృద్ధి కోసం తిరిగి పిలిచే అవకాశం ఉన్నప్పటికీ నిమజ్జనం ముగిసిన రెండ్రోజులకు హడావిడిగా టెండర్లు పిలవడంపై పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికులకు అదనంగా వేతనం ఇవ్వాలి

జగద్గిరిగుట్ట: మున్సిపల్ కార్మికులకు అదనంగా వేతనంతో కూడిన ఒకరోజు సెలవులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. గురువారం జగద్గిరిగుట్టలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. యేసు రత్నం హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, పారిశుద్ధ్య కార్మికులు, అన్ని రంగాలకు చెందిన కార్మికులు సుమారుగా 15 రోజుల నుంచి మండపాల వద్ద శుభ్రం చేయడంతో పాటు ప్రతి చెరువు వద్ద రాత్రింబవళ్లు పని చేశారన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రాష్ట్ర నాయకులు రాములు, వి. హరినాథ్, కేశవులు, కత్తుల దుర్గయ్య, కమల, ఉమారాణి హనుమకొండ జిల్లా మున్సిపల్ అధ్యక్షులు వేల్పుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.